# ఒక్క రూపాయికే పత్తి విత్తనాలు

-వ్యవసాయ శాఖ పిలుపు



2లో

Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

11వ వార్షికోత్సవం 2016 - 2026 మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 200
సంచిక : 300
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శుక్రవారం, జులై 03, 2026

# ప్రైవేట్ ఆస్పత్రుల రాజ్యం

## ఖమ్మంలో అనుమతులు లేకున్నా వైద్యం...

### -నియంత్రణ లేక ఫీజుల దోపిడీ

**టీ మీడియా ,జూలై 2, ఖమ్మం బ్యూరో :**ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఆస్పత్రులు... నేడు కొన్నిచోట్ల నిబంధనలను పక్కనపెట్టి వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయా? ఖమ్మం జిల్లాలో ప్రైవేట్ వైద్యరంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అదే స్థాయిలో పర్యవేక్షణ ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.జిల్లాలో సుమారు 582 ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు పనిచేస్తున్నట్లు అధికారిక లెక్కలు సూచిస్తున్నాయి. అయితే వీటిలో గణనీయమైన సంఖ్యలో సంస్థలు పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ తీసుకుని..నిబంధనల ప్రకారం ఏ ప్రైవేట్ ఆస్పత్రి అయినా ముందుగా ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ పొందాలి. అనంతరం భవనం, సిబ్బంది, పరికరాలు, భద్రతా ప్రమాణాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అగ్నిమాపక భద్రత, ల్యాబ్ సౌకర్యాలు, రిజిస్టర్డ్ వైద్యుల




లభ్యత వంటి అంశాలను అధికారులు పరిశీలించిన తర్వాత మాత్రమే శాశ్వత అనుమతి ఇవ్వాలి.కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని వైద్యరంగానికి చెందిన వర్గాలు చెబుతున్నాయి. కొంతమంది ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌తోనే సంవత్సరాలుగా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.ఈ అంశాల్లో లోపాలు ఉన్నప్పటికీ కొన్ని ఆస్పత్రులు కొనసాగుతున్నట్లు ప్రాథమిక పరిశీలనలో గుర్తించినట్లు తెలుస్తోంది. నిబంధనలు పాటించని ఆస్పత్రులపై దశలవారీగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**రిజిస్టర్డ్ వైద్యుల పేర్లు... సేవలు అందించేది మరెవరు?**

కొన్ని ఆస్పత్రుల్లో రిజిస్టర్డ్ వైద్యుల పేర్లు బోర్డులపై కనిపిస్తున్నా, రోజువారీ వైద్య సేవలు అందించేది ఇతరులేనని ఆరోపణలు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో అర్హత కలిగిన వైద్యులు అందుబాటులో లేకపోవడం రోగుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

అధికారులు **పరిశీలించే ప్రధాన అంశాలు**

భవనానికి చట్టబద్ధమైన యాజమాన్యం లేదా లీజ్ ఒప్పందం ఉందా?బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం జరుగుతోందా?అవసరమైన ల్యాబ్ సదుపాయాలు ఉన్నాయా?సంబంధిత వైద్య మండలి/అధికారిక నమోదు వివరాలు ఉన్నాయా?రిజిస్టర్డ్ వైద్యులు సేవలు అందిస్తున్నారా?అవసరమైన సిబ్బంది, పరికరాలు అందుబాటులో ఉన్నాయా?



అనుమతి లేని మెడికల్ ల్యాబ్

**బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో లోపాలా?**

ఆస్పత్రుల నుంచి వెలువడే సూదులు, రక్తంతో కలిసిన వస్తువులు, ఇతర ప్రమాదకర వైద్య వ్యర్థాలను ప్రత్యేక విధానంలోనే నిర్వహించాలి. కానీ కొన్ని చోట్ల ఇవి సాధారణ చెత్తతో కలిపి పడేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి నిర్లక్ష్యం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి

3లో



## ఉత్తమ ఫలితాలతో రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలి

### -డిఐఈఓ రవి బాబు

**టీ మీడియా, జూలై 2, పాలేరు:** రానున్న విద్యా సంవత్సరం లోనూ ( 2026బి27 ) ఇదే స్ఫూర్తితో ఉత్తమ ఫలితాలు సాధించి తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శ కళాశాలగా నిలవాలని ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి బాబు ఆకాంక్షించారు. మండల కేంద్రం కూసుమంచి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలోని పనితీరును సమీక్షిస్తూ విద్యార్థుల అడ్మిషన్లు, యు డైస్ వివరాలు, హాజరు, విద్యా ప్రమాణాలు, కళాశాల నిర్వహణ తదితర గురించి ఆయన సమగ్రంగా తెలుసుకున్నారు. టీచింగ్ డైరీలు, అటెండెన్స్ రిజిస్టర్లు, అకాడమిక్ రికార్డులు, ఇతర పరిపాల న రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, అధ్యాపకులకు అవసరమైన సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం ఆగస్టు నెల లో పూర్తయ్యే అవకాశం ఉందని, దాంతో కళాశాలను నూతన భవనంలోకి మారనున్నట్లు ఆయన తెలిపారు. కళాశాల ప్రారంభ విద్యా సంవత్సరం మొదటి బ్యాచ్ లోనే 90 శాతం ఫలితాలు సాధించడం ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి గర్వకాననమని ఆయన

3లో

## నాణ్యమైన పోషకాహారం అందించాలి

### -జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**టీ మీడియా, జూలై 2, కొణిజర్ల:**ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు చదువు మీద శ్రద్ధ చూపెడతారనీ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా కొణిజెర్ల మండలం పల్లిపాడు గ్రామం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, తరగతి గదులు, మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి, వంటగది నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.భోజనం రుచిగా ఉందా, మెనూ ప్రకారం గుడ్డు, వెజిటబుల్ బిర్యానీ, పప్పు, సాంబారు అందిస్తున్నారా, ఆహారం పరిశు



భ్రంగా తయారవుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో కీలకమని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వినియోగించాలని, ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి తాజా కూరగాయలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని

3లో









## అక్కినా పురం తండాలో చిరుత కలకలం

**టీ మీడియా, జూలై 2,ఏన్కూరు:**ఏ న్కూర్ మండల పరిధిలోని అక్కినాపురం తండా గ్రామ శివారు రాజారావుపేట సెక్షన్‌లో చిరుతపులి సంచరించినట్లు అనుమానాలు వ్యక్తమవడంతో గ్రామస్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గురువారం ఉదయం అక్కినాపురంతండాకు చెందిన ఓ రైతు తన వ్యవసాయ పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా, పొలంలో పెద్ద జంతువుకు చెందిన కాలి ముద్రలు కనిపించాయి. వాటిని గమనించిన రైతు వెంటనే గ్రామానికి చేరుకుని స్థానికులకు సమాచారం అందించడంతో పాటు అటవీశాఖ అధికారులకు కూడా సమాచారం ఇచ్చాడు.సమాచారం అందుకున్న కొత్తగూడెం అటవీ డివిజన్ పరిధిలోని జూలూరుపాడు రేంజ్ ఎఫ్ఆర్‌వో తేజస్వి ఆదేశాల మేరకు వినోబానగర్ బీట్ ఆఫీసర్ బి. బాలాజీ గ్రామ పెద్దలు,రైతులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టారు. అనవాళ్ళ ప్రకారం అది నక్కగా అటవీ అధికారులు తేల్చారు.వదంతులను నమ్మకుండా అధికారులకు సహకరించాలని కోరారు.

## ఒక్క రూపాయికే పత్తి విత్తనాలు

### -వ్యవసాయ శాఖ పిలుపు



**టీ మీడియా, జులై 2,ముదిగొండ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ ఆహార భద్రత పథకం కింద ముదిగొండ మండల పరిధిలోని రైతులకు భారీ రాయితీపై పత్తి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి సరిత ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌లో రూ. 901 విలువ చేసే ఒక్కో పత్తి విత్తన ప్యాకెట్‌ను, అర్హులైన రైతులకు కేవలం ఒక్క రూపాయికే అందజేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.అధిక సాంద్రత పద్ధతి ద్వారా పత్తి సాగు చేసి, రైతులు అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ విత్తనాలను ఉచితంగా (భారీ సబ్సిడీపై) సరఫరా చేస్తోందని వివరించారు.
పథకం వివరాలు మరియు

**అర్హతలు గరిష్ట పరిమితి:** ప్రతి రైతుకు గరిష్టంగా రెండున్నర (2.5) ఎకరాల వరకు విత్తనాలు అందిస్తారు.ఎకరానికి కోటా: ఎకరానికి ఆరు ప్యాకెట్ల చొప్పున విత్తనాలను కేటాయించడం జరుగుతుంది.రైతు చెల్లించాల్సిన ధర: రూ. 901 విలువైన ప్రతి ప్యాకెట్‌కు కేవలం రూ. 1 మాత్రమే చెల్లించాలి.విత్తనాలు ఎక్కడ లభిస్తాయి?లి పత్తి సాగుపై ఆసక్తి ఉన్న ముదిగొండ మండల రైతులు స్థానిక రైతు వేదికకు వెళ్లి, ఒక ప్యాకెట్‌కు ఒక్క రూపాయి చొప్పున నగదు చెల్లించి ఈ విత్తనాలను పొందవచ్చు. విత్తనాలు తీసుకున్న రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆధునిక పద్ధతుల్లో సాగు చేసుకోవాలని ఏఓ సరిత సూచించారు. మండలంలోని పత్తి రైతులందరూ ఈ సుదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

**టీ మీడియా, జూలై 2, కోదాడ:** కోదాడ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు కోర్టు కాంప్లెక్స్ బిల్డింగ్ పనులను సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనుల తీరును, నిర్మాణంలో ఉన్న వివిధ విభాగాల గదులను, న్యాయస్థానాల రూపురేఖలను ఆయన పరిశీలించి గుత్తేదారుకు తగు సూచనలు చేశారు. నిర్ణీత సమయంలోగా భవన నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, దేవబత్తిని నాగార్జున, ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, సెక్రటరీ రామకృష్ణ, రంజాన్ పాషా, రంగారావు, పెద్దబ్బాయి, కెవి రావు పాల్గొన్నారు.



# శ్రీవారి ఆలయంలో జీర్ణోద్ధరణ ధ్వజస్తంభ కార్యక్రమాలు

**టీ మీడియా, జూలై 2,ఎర్రుపాలెం:** శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంజమలాపురం నందు జీర్ణోదరణ, ధ్వజ ప్రతిష్ట సహిత మహా కుంభాభిషేకం కార్యక్రమములో భాగంగా ఈరోజు ఉదయం 07-00 ని"లకు ప్రాత:కాల పూజలు, బలిహరణ అనంతరం శ్రవణా నక్షత్ర యుక్త కర్కాటక లగ్న పుష్కరాంశము నందున సి యు అలివేలుమంగా, పద్మావతి అమ్మవార్లకు ,సోమేశ్వర స్వామి వారి ఆలయ జీవద్వజ ప్రతిష్ట సుముహూర్తమునా భక్తుల గోవింద నామ స్మరణల మధ్య ధ్వజ ప్రతిష్ట అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రాణ ప్రతిష్టా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా కమిటీ వారు అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో 12000 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించినారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్



ఎం.వీరస్వామి , ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయ దేవ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ, వకుళ మాత స్టేడియం నిర్మాణదాత తుళ్లూరు కోటేశ్వరరావు నిర్మలా కుమారి దంపతులు, గ్రామస్తులు భక్తులు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలి

**టీ మీడియా, జూలై 2, మణుగూరు**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని, మంత్రి సీతక్కను ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రంలో ఐటిడిఏ పరిధిలోని గిరిజన గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, అదనపు నిధుల మంజూరు, విద్య, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని, ఐటీడీఏ పరిధిలోని గ్రామాలకు అదనపు బడ్జెట్ కేటాయించి, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి అవకాశాలను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గిరిజన ప్రాంతాల్లో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అదనపు ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రజలు సొంత ఇంటి కలను సాకారం చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఇంద్ర మహిళా శక్తి కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక బలోపేతం, మహిళా సాధికారత, ఉపాధి అవకాశాల కల్పన, విద్య, వైద్యం, రైతు సంక్షేమం, సామాజిక భద్రత వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని కొనియాడారు.
ప్రత్యేకించి ఇంద్ర మహిళా శక్తి ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా, స్వయం ఉపాధి దిశగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక పురోగతి, కుటుంబాల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### -ముగ్గురు అరెస్ట్ -- రెండు బైకులు, నగదు స్వాధీనం

**టీ మీడియా, జూలై 2,అశ్వారావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో అక్రమ జూద కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. చట్టవ్యతిరేకంగా నిర్వహిస్తున్న పేకాట, కోడిపందాలు, ఇతర జూద కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్న అశ్వారావుపేట ఎస్‌ఐ యయాతి రాజు, ప్రజల నుంచి అందుతున్న సమాచారాన్ని సత్వరమే పరిశీలిస్తూ మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో గురువారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే అశ్వారావుపేట ఎస్ హెచ్ ఓ యయాతి రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందంగా సంఘటనా స్థలానికి చేరుకుని ఆకస్మికంగా దాడి నిర్వహించారు.పోలీసులను గమనించిన కొందరు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించినప్పటికీ, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సంఘటనా స్థలంలో తనిఖీలు నిర్వహించగా, పేకాటకు వినియోగిస్తున్న రూ.5,500 నగదుతో పాటు రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.పేకాట వంటి జూద కార్యకలాపాలు సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని, ముఖ్యంగా యువతను తప్పుదారి పట్టించడంతో పాటు అనేక కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తాయని పోలీసులు పేర్కొన్నారు. జూద వ్యసనం కారణంగా కుటుంబ కలహాలు, అప్పుల బాధలు, నేరాల పెరుగుదల వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. జూదాలను అరికట్టేందుకు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ మండల పరిధిలో నిరంతర నిఘా కొనసాగుతోందని, గ్రామాలు, శివారు ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ యయాతి రాజు మాట్లాడుతూ, పేకాట, కోడిపందాలు లేదా ఇతర జూద కార్యకలాపాలను నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు డయల్-- 100కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.అశ్వారావుపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల నిర్మూలన లక్ష్యంగా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని, ప్రజల సహకారం ఉంటే ఇటువంటి జూదాలను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.

## ప్రైవేట్ ఆస్పత్రుల రాజ్యం

ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**'సంతాన సాఫల్య కేంద్రం' పేరుతో ప్రచారమా?**

జిల్లాలో కొన్ని ప్రసూతి ఆస్పత్రులు సరైన అనుమతులు లేకుండానే “సంతాన సాఫల్య కేంద్రం” పేరుతో బోర్డులు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఇలాంటి సేవలకు ప్రత్యేక అనుమతులు అవసరం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు పర్యవేక్షణ బాధ్యత మాత్రమే ఉండగా, అనుమతి లేకుండా ఇటువంటి సేవల ప్రకటనలు చేయడం చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిసింది.

**ఒకే పరీక్షకు నాలుగు రకాల ఫీజులు!**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లేదా తక్కువ ధరకు లభించే కొన్ని పరీక్షలకు, ప్రైవేట్ రంగంలో ఒక్కో కేంద్రం ఒక్కో రేటు వసూలు చేస్తోంది. ఒకే రక్త పరీక్షకు కూడా ప్రాంతాన్ని బట్టి భారీ ధర వ్యత్యాసం కనిపిస్తోందని రోగులు వాపోతున్నారు.ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్ల ఫీజులను నియంత్రించే సమగ్ర విధానం లేకపోవడంతో ప్రజలు ఇష్టారాజ్యంగా నిర్ణయించిన ధరలను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

డయాగ్నస్టిక్ సెంటర్ల ఫీజులపై స్పష్టత లేదు

జిల్లాలోని అనేక డయాగ్నస్టిక్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రులు ఒకే పరీక్షకు ఒక్కో చోట ఒక్కో విధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రస్తుతం పరీక్షల ఫీజులను నియంత్రించే స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు లేకపోవడంతో ప్రజలు అధిక భారం భరించాల్సి వస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం ఆరోగ్యశాఖ మంత్రి కూడా ఫీజుల నియంత్రణ అవసరాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. సంబంధిత కమిటీ నివేదిక ఆధారంగా భవిష్యత్తులో ఒకే విధమైన ఫీజుల విధానంపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

**తనిఖీలు కాగితాలకే పరిమితమా?**

నిబంధనల ప్రకారం ప్రతి ఆస్పత్రిని నిర్దిష్ట వ్యవధిలో తనిఖీ చేయాలి. లోపాలు గుర్తిస్తే నోటీసులు, జరిమానాలు, అవసరమైతే లైసెన్స్ రద్దు వంటి చర్యలు తీసుకోవాలి. అయితే ఈ తనిఖీలు ఎంత క్రమం తప్పకుండా జరుగుతున్నాయి? గుర్తించిన లోపాలపై ఎంతవరకు చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై పారదర్శక సమాచారం ప్రజలకు అందుబాటులో లేదు.

ప్రజల డిమాండ్

**ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లా పరిపాలన ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.**

జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల అనుమతుల జాబితాను బహిరంగంగా ప్రకటించాలి.అనుమతి లేని ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి.సంతాన సాఫల్య కేంద్రాల అనుమతులను ప్రజలకు వెల్లడించాలి.

డయాగ్నస్టిక్ పరీక్షలు, వైద్య సేవల ఫీజులకు పారదర్శక విధానం తీసుకురావాలి.తనిఖీల నివేదికలను ప్రజల ముందుంచి బాధ్యతాయుత వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

**టీ మీడియా ప్రశ్నలు**

**జిల్లాలో ఉన్న 582 ప్రైవేట్ వైద్య సంస్థల్లో పూర్తిస్థాయి అనుమతులు ఉన్నవి ఎన్ని?ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌తోనే కొనసాగుతున్న సంస్థలు ఎన్ని?**

గత రెండేళ్లలో ఎన్ని ఆస్పత్రులపై చర్యలు తీసుకున్నారు?బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై ఏం చర్యలు తీసుకున్నారు?ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించే ప్రత్యేక వ్యవస్థ ఉందా?ప్రజల ప్రాణాలతో ముడిపడిన వైద్యరంగంలో నిబంధనలు కచ్చితంగా అమలైతేనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. అధికారుల పర్యవేక్షణ, పారదర్శకత, బాధ్యతాయుత చర్యలే దీనికి పరిష్కారం.

## ఉత్తమ ఫలితాలతో రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలి

కొనియాడారు. అధ్యాపకులు సిబ్బంది సమిష్టి కృషిని అభినందిస్తూ, ప్రభుత్వ కళాశాలలపై ప్రజలు మరింత విశ్వాసం పెంపొందించే విధంగా సేవలందించాలని ఆయన సూచించారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి ఉత్తమ ఫలితాల సాధన, పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసి దిశగా అధ్యాపకులు కృషి చేయాలని రవిబాబు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ బి వీరభద్రం మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవర్చడం, నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ ఉత్తమ విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడం కోసం అధ్యాపకులు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కూసుమంచి మండల పరిసర ప్రాంత ప్రతి విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి ఉత్తమ విద్యను అభ్యసించేందుకు తాము ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని అమలు చేస్తున్నట్లు ఆయన సవివరంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పోషకాహారం అందించాలి

అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కొణిజెర్ల తహసీల్దార్ అరుణ, వైరా మున్సిపల్ కమీషనర్ రామచందర్ రావు, ఎంఈవో చావా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రంలో తాగునీటి సంక్షోభం

### గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు




**టీ మీడియా, జూలై 2, కొత్తగూడెం :** రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గత రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాల నుండి చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులు తాగునీటి కోసం ఆస్పత్రి వెలుపలికి వెళ్లి బాటిళ్లలో నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కనీస అవసరమైన తాగునీటి ఏర్పాట్లు లేకపోవడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆస్పత్రికి వచ్చే చాలామంది నిరుపేదలే. వారికి నీటిని కొనుక్కొని తాగడం వారిపైన ఆర్థిక భారం పడుతుందంటున్నారు సహాయకులు. ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి ఆస్పత్రిలో నీటి సమస్య తలెత్తడం పరిపాటిగా మారిందని, శాశ్వత పరిష్కారం కోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వారు తెలిపారు. జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ఆస్పత్రిని సందర్శించిన సందర్భాల్లో కూడా సమస్యను వివరించినప్పటికీ ఇప్పటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. కనీస ప్రత్యామ్నాయ చర్యలు కూడా తీసుకోవడం లేదని రాత్రిపూట నీళ్లు అవసరమైతే రామవరం వరకు నడుచుకుంటూ వెళ్లవలసి వస్తుందని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సహాయకులుగా వచ్చినటువంటి వృద్ధులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అక్రమ కనెక్షన్లతో ఆస్పత్రికి నీటి సరఫరా నిలిచిందా?**

ఆస్పత్రిలో నవ భారత్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్‌కు స్థానిక బోరు నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉండడంతో శుద్ధి యంత్రాలు తరచూ దెబ్బతింటున్నాయని సిబ్బంది తెలిపారు. దీంతో గతంలో సింగరేణి కాలనీలకు సరఫరా చేసే నీటిని ఆస్పత్రికి అందించేలా అప్పటి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెం రాజు సహకారంతో ప్రత్యేక పైప్‌లైన్, నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు.

అయితే ఇటీవల ఆ పైప్‌లైన్‌కు అక్రమంగా నీటి కనెక్షన్లు ఇవ్వడం వల్ల ఆస్పత్రికి రావాల్సిన నీరు తగ్గిపోయిందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. గతంలో సింగరేణి సెక్యూరిటీ విభాగం నీటి చోరీకి పాల్పడిన వారిని హెచ్చరించినప్పటికీ, మళ్లీ అక్రమ కనెక్షన్లు పెరగడంతో సమస్య తీవ్రరూపం దాల్చిందని తెలిపారు. నీటి చోరీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**మిషన్ భగీరథ నీటిని అందుబాటులోకి తేవాలి**

ఆస్పత్రిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ప్యూరిఫైయర్ ప్లాంట్ కోసం ప్రత్యేక సంపును ఏర్పాటు చేసి, సింగరేణి నీటితో పాటు మిషన్ భగీరథ నీటిని కూడా అనుసంధానం చేయాలని స్థానికులు సూచిస్తున్నారు. అలాగే మరుగుదొడ్లలో విరిగిపోయిన కుళాయిల కారణంగా నీరు వృధా అవుతోందని, వాటిని వెంటనే మార్చి నీటి వృథాను నివారిస్తే ఆస్పత్రిలో 24 గంటలూ నీటి సరఫరా కొనసాగుతుందని అభిప్రాయపడుతున్నారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి తాత్కాలికంగా తాగునీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయడంతో పాటు, శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### .-విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
### -జిల్లా కలెక్టర్ అంకిత్





**టీ మీడియా ,జూలై 2, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని డాక్టర్లు, ఇతర సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి వారి హాజరు, విధుల నిర్వహణపై ఆరా తీశారు. ఆసుపత్రి సిబ్బంది ఎన్ని షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న మహిళల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. మూడు షిఫ్టుల్లో రోగులకు సేవలు అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు. జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవల నాణ్యత, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది స్పందనపై ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట హాస్పటల్ సూపరిండెంట్ ఎం రాధా మోహన్, డివైసిఎస్ఆర్ఎంఓ సీతారాం, ఆర్ ఎం ఓ చైతన్య, కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత లేకుండా పంపిణీ చేయాలి

### అఖిల భారత ఐక్య రైతు సంఘం



**టీ మీడియా ,జూలై 2, జూలూరుపాడు :** రైతులకు ఇబ్బందికరంగా మారిన మొబైల్ యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, క్షేత్రస్థాయిలో రైతులకు యూరియా బస్తాల కొరత లేకుండా సకాలంలో పంపిణీ చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఏఐయూకేఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తాసీల్దార్ శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోతు ధర్మ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వల్ల దేశంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భూములకు పట్టాలు లేని సామాన్య రైతులకు, కౌలు రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే యూరియా, డీఏపీ తదితర ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని, అడ్డగోలుగా పెరిగిన ఎరువులు, విత్తనాల ధరలను తక్షణమే తగ్గించి రైతులకు ఊరట కలిగించాలని కోరారు.కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దామని గొప్పలు చెప్పడం తప్ప, క్షేత్రస్థాయిలో అన్నదాతల అవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గత 12 ఏళ్ల బీజేపీ పాలనలో పూర్తిగా కార్పొరేట్ శక్తులకు, గ్రామీణ సంపన్న వర్గాలకే మేలు చేకూరుస్తూ, రైతుల నడ్డి విరిచే విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు.గ్రామీణ ప్రాంతాల్లో మెజారిటీ రైతులకు స్మార్ట్‌ఫోన్లు లేవని, ఒకవేళ ఉన్నా వాటిని సాంకేతికంగా ఉపయోగించడం తెలియడం లేదని అన్నారు. దీనికి తోడు పల్లెల్లో సిగ్నల్ సమస్యలు తోడవ్వడంతో యాప్ సకాలంలో పని చేయక, యూరియా దొరకక రైతులు సాగు సమయంలో అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికత పేరుతో రైతులను ఇక్కట్ల పాలు చేయడం తగదని, తక్షణమే ఈ యాప్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ మండల నాయకులు లింగాల వీరభద్రం, గుగులోత్ సేవియా, ఇరుప రాములు, కల్తి నాగేశ్వరరావు, లింగ, బాబురావు, నవీన్, పాల్గొన్నారు.